తరహాలు

అసలా మనిషి తరహాయే అంత అనుకుంటుంది సావిత్రి. కాకపోతే మరేమిటి? రేవు దాటేక తెప్పను తగలబెట్టేరకం వాడాయె! అసలతని తీరే అంత. అందుకనే గ్లాసుడు కాఫీ గుక్క తిప్పకుండా తాగేసింది, మళ్ళీ మాటాడకుండా! అతను కాస్త కోప్పడ్డాడే అనుకొంది. అంతమాత్రానికి ఇంకో సారైనా అడక్కుండా ఆమె ఈ పని చేయడం ధర్మమనీ, భార్య లక్షణమేనా, అని ఎవరైనా అడగచ్చు. సావిత్రేం తెలివి తక్కువది కాదు, అభాండం అంతా తన మీద వేసుకోటానికి. 'ఇన్ని సంవత్సరాల నుంచి కాపురం చేస్తున్నానాయె! ఇంత మాత్రం చెయ్యలేకపోతే ఈ మనిషితో పడేకన్న ఏ నుయ్యో గొయ్యో చూసుకుని వుందును!' అంటుంది ఖండితంగా.

అసలే చిన్నప్పట్నుంచీ కాస్త పెంకి ఘటం అని పేరు ఉండనే వుంది. భక్తి తప్పినా ఫలం దక్కితే చాలంటుంది సావిత్రి. సాయంత్రానికి పోను కాఫీ పొడరూ ఎలాగూ ఇంటికి వస్తుంది. అంతే తనకు కావలసింది. ఓ రెండు మాటలు అతనంటేమాత్రం అదోక లెక్కలోది కాదు.

ఎదురుగా బల్లమీద గ్లాసు. అందులో వేడిగా పొగలుగక్కే కాఫీ కళ్ళబడ్డం తోటే ఏదో రాసుకుంటున్న వాడల్లా తలెత్తి సివంపూనినవాడిలా అన్నాడు విశ్వనాథం: 'తాగనని చెప్పలా? వెధవకాఫీ... కొంప గుల్లచేస్తోంది. తీసుకుపో యిక్కణ్ణుంచి!'

క్షణంసేపు సావిత్రి నిర్ఘాంతపోయింది. 'ఎందుకండీ! అంత నోరుచేసుకుంటారు? వద్దంటారని నేనేవన్నా కలగన్నానా?' అంది కాస్త నొచ్చుకుని.

'ఎందుకు కలగనాలి? నిన్న సాయంత్రం చెప్పలా? ఒకసారి చెప్తే మనిషికి బుద్ధుండాలి' తలవంచుకునే అన్నాడు విశ్వనాథం.

'బాగుందండీ! మీరు కాఫీ వద్దంటే మానెయ్యక, పోనీ తాగుతారేమోనని తీసుకురావడంకూడా [illegible]. ఇదుగో చూడండి! ఇవాళ కాఫీ ఎంత బాగుందో చూడండి! మరి వదిలేస్తే వృధాగా...'

'కోపంగావున్న వాళ్ళని ఇలాటిమాటలంటే నిజంగా ఉడికించటమే. విశ్వనాథానికి అరికాలిమంట నెత్తికెక్కింది. 'ఇహ చాలించండి కాఫీ వర్ణన! రుచిమాసి తాగడానికి నేనేం నీలాగ కరువాచిపోలేదు! అదేదో నువ్వే తీరిగ్గా అనుభవించు ... వెళ్ళిక్కణ్ణుంచి' అన్నాడు.

'సరేలెండి బాబూ! ఇహచాలు. నేనే తాగుతాను హాయిగా!' వెనుదిరిగి వెళ్తూ కంటి కొసలలోనుంచి ఓమారు ఓరగా చూసింది సావిత్రి. చివర 'హాయిగా' అన్న మాటకి విశ్వనాథం తాపం నసాళానికంటిందనే చెప్పాలి. నిప్పులు కురిపిస్తున్నాడు కళ్ళల్లోంచి. మరు నిమిషంలో నాలుగుగుక్కల్లో గ్లాసుడు కాఫీ పరమానందంగా ఖాళీచేసింది సావిత్రి. 'సిగ్గులేని ఘటం' అనుకున్నాడు విశ్వనాథం.

ఏ. యస్. కళ్యాణి

సావిత్రికోక ధీమావుంది. అప్పుడప్పుడు కాఫీమీద పేచీలువచ్చి మానెయ్యడం, మర్నాటినుంచీ తిరిగి యథాప్రకారంగా తాగుతూండడం విశ్వనాథానికి పరిపాటే. అందుకని సావిత్రి ఆ విషయం అట్టే పట్టించుకోకపోడం అలావుంచి, ఆ వేళ సంతోషంగా రెండు గ్లాసులూ తనే పట్టించేసింది! పైగా కోపంవస్తే మానేయడం ఉత్తమం అని కూడా అనింది!

అసలు వాళ్ళిద్దరిమధ్యా తరుచు కాఫీ విషయంలో తగాదాలు, మూతివిరుపులు, ముక్కు విరుపులు, ఎడపెడముఖాలూ కలుగుతూండడం అలవాటు. మళ్ళీ యిద్దరూ ప్రతీ ఉదయం తప్పక 'టంచను'గా కాఫీ స్వీకరించేవాళ్ళే. కాని చిత్రమేమిటంటే విశ్వనాథంలో - అది దుర్గుణం అనాలో, సద్గుణం అనాలో ఆ పరమాత్ముడికే తెలుసు - ఒకగుణం వుంది. ప్రతీ ఉదయం తాను కాఫీ తాగుతున్నాడంటే అది భార్య ఏడ్చిపోతుందనే కాని, తను మనఃపూర్వకంగా తాగడం కాదని బల్లగుద్ది చెప్తాడు విశ్వనాథం! 'వెధవ కాఫీ! మంచినీళ్ళపాటి చెయ్యదు!...' అంటాడు. సావిత్రి కది నచ్చదు. కాఫీవిలువ ఆవిడకి బాగా తెలుసు. తన దృష్టిలో అంత విలువైన వస్తువును అతడంత హీనంగా చూడటం ఆవిడ సహించలేదు. ఆవిడని ఉడికించటానికో, లేకపోతే తనకున్న కసికొద్దీనో అదేమాట పదేపదే అంటాడు విశ్వనాథం.

తాను పురుషుడు కాబట్టి ఎప్పుడూ ఓ మెట్టు పైనుండాలన్న సంగతి అతడెప్పుడూ, ఆఖరికి కలలోకూడా మరిచిపోడు. అందుకనే సావిత్రి 'ఏరుదాటేక తెప్పగాల్చేరకం' అనడం. లేకపోతే రెండు పొద్దులూ - ఇంకా తను తెచ్చియిస్తే మరోసారి కూడా - కాఫీ తాగుతూనే అది ఏదో అనవసరమైన వస్తువులా కట్టడం ఏమంత బాగు? పోనీ అంత విలువలేని కాఫీని తాను త్రాగడం మానేశాడా? అదీలేదు. అంతకాడికి యిన్ని శాపనార్థాలు పెట్టడం దేనికి? అంటుంది సావిత్రి. 'నేను మానెయ్యకపోడానికి కారణం నువ్వే' అంటాడు విశ్వనాథం. అవును. తనొక్కర్తే తాగితే బాగుండదని తనకి అదోలా తోచి భర్తకి యిస్తూవుండడం నిజం. 'నేనిస్తే మీరు తాగాలని లేదుగా!' అంటుంది సావిత్రి.

కాఫీపొడరు తెమ్మన్నప్పుడో, లేక ఇంటి జమా ఖర్చులు వేస్తున్నప్పుడో కాఫీ కయ్యే ఖర్చుచూస్తే విశ్వనాథంమనస్సు చుఱచుఱమంటుంది. అటువంటప్పుడల్లా భార్యమీద బుసబుసలాడ్డం రివాజు. "వెధవ కాఫీ...ఎందుకూ పనికిరాని తాగుడుకు యింత ఖర్చా? - ఇక సంసారాన్ని మూటగట్టి ఏట్లో విసిరి సన్యాసం పుచ్చుకోవచ్చు ముందు నెలనుంచి నువ్వు కాఫీకి స్వస్తి చెప్పాల్సిందే. నేనసలు పొడరే తీసుకురాను."

అలా అనప్పుడల్లా సావిత్రి నవ్వుకొ

టుంది — పైకి కాదు సుమండీ! మధ్య మధ్య విసుస్తుంది కూడా.. ఎన్నిసార్లు తనల్లా అన్నాడో అలా ఎన్ని నెలలు గడిచిపోయాయో విశ్వనాథానికి గుర్తుండదు.

'ఇదొక అలవాటా? దర్జాగా మానెయ్యొచ్చు' అంటాడు. కాబట్టి ఎన్ని వాగ్వాదాలు వచ్చినా తను మానెయ్యాల్సిందే కాని, ఎన్ని తిట్లు తిన్నా, ఎన్ని కన్నీళ్లు కారినా సావిత్రిమాత్రం 'ఆపిచ్చి పని' ఎప్పుడూ చెయ్యదు. తీరిగ్గా తాగి మరీ విసుస్తుంది అంతగా అయితే... ఈ విషయంలో మాత్రం సావిత్రి సహనం ఎంతైనా అభినందించదగిందే

'కాఫీ తాగడంమాత్రం తప్పదు ఎన్ని పేచీలు పెట్టుకున్నా'.. సావిత్రి ఆమాట అంతక్రితంరోజు సాయంకాలం అనడం అక్షరాలా నిజం. మరి పేచీ అక్కడే వచ్చింది! 'ఇంతమాట నువ్వు అనగూడనిది తాగనే అనుకో అది నీకోసంగాని నాకోసం కాదు పైగా నన్ను దెప్పిపొడుస్తావా?.. ఊరుకుంటూంటే మరీ రెచ్చిపోతోంది పొగరు!...' అన్నాడు విశ్వం. కోపం వస్తుందేమో అని సందేహించినా అనకుండా ఉండలేకపోయింది సావిత్రి

'అంటే తప్పేమిటండీ? ఉన్నమాటంటే'— నాలుక కొరుక్కుంది సావిత్రి.

'ఆ పైమాట కూడా అను. ఉన్నమాటంటే ఉలుకెక్కువని! తాగడం మానలేని ముఖానివి నీలో నువ్వేడవక పైగా నన్నంటావా? నన్ననడానికి నువ్వెవరు? నేను సంపాదించేవాణ్ణి! నన్ననే అధికారం లేదు నీకు—'

పాపం! సావిత్రికి అభిమానం వచ్చింది. అయినా తనకు కాఫీ అవసరం అన్నమాట నిజమే. కాని యింతలోకే అధికారాలూ, అనధికారాలూ వొలికిపోడం దేనికి?... తనేదో మాటవరసకి అంది ఆమాట! బాగుంది! తను మాటవరసకంటే అతనికి కూడా అల్లా అనిపించాలని తననుకోడం పొరబాటు. అతని కది, పైగా ఒక ఆడదాని చేత అంతమాట, అందులోనూ అంత వ్యంగ్యంగా, అనిపించుకోటం శిరస్సు కొట్టేసినట్టు కాదూ?!! ..ఏది ఏమైతేనేం అతను ఆవాళనుంచీ కాఫీ ముట్టుకోగూడదని శపథం చేసుకున్నాడు

విశ్వనాథం కాఫీ తాగి రెండురోజులయింది సావిత్రికి మనస్సులో కష్టం లేదనడం పొరబాటు, కాని కాఫీ తాగడం మాత్రం మానలేదు ఈసారి విశ్వనాథం బాగా పట్టుదలమీదే ఉన్నాడనుకుంది సావిత్రి మధ్యలో తీసుకెళ్ళి యివ్వాలనుకున్నా తిడతాడనే భయంతో వెనుకంజ వేసింది

మూడోనాడు సాయంత్రం విశ్వనాథం ఆఫీసునుంచి ఇంటికి వచ్చాక తిరిగి బైటికి

'ఏమండీ! అలా వున్నారు?' అంది దగ్గరగా వచ్చి

'ఎలావున్నాను? బాగానే వున్నాను' అన్నాడు ముక్తసరిగా, మాట్లాడడం యిష్టంలేనట్టు.

'మీరలా అంటేమాత్రం చూసేవాళ్లకి తెలియదేమిటి?...తలనొప్పిగా వుందా?'...

'ఏదో కొద్దిగావుందిలే. నువ్వు మరేం బెంగపడక్కర్లేదు!' అన్నాడు వెటకారంగా విశ్వనాథం. సావిత్రికి జవాబు కష్టం కలిగించింది 'మొగవాళ్ళింతకన్నా సౌమ్యంగా ప్రవర్తించారా యేం? వాళ్ల తీరే అంత అందులో భార్యలదగ్గిర ఇహ చెప్పనే అక్కర్లేదు!' అనుకుంది సావిత్రి మర్నాటి ఉదయానికి కూడా తలనొప్పి తగ్గలేదు - సెలవు చీటీ రాస్తుంటే అనుకుంది సావిత్రి

'పోనీ యాస్ప్రో గాని మరేదైనా వేసుకోరాదుటండీ?'

'అన్నీ అయ్యాయి. అంతమాత్రం తెలియక్కాదు!' ఈ మాటూ కొట్టినట్టుగానే జవాబు. చెప్పొద్దూ! సావిత్రికి నిజంగా కోపంవచ్చింది ఇంక మరి మాట్లాడకూడదనుకుంది. మధ్యాహ్నానికి ఒళ్లుకూడా కొద్దిగా వేడెక్కినట్టుంది సావిత్రికేమీ తోచలేదు ఎలాగ? ఆలోచించింది సావిత్రి మెరుపులా తట్టిందొక ఊహ. ఆమె పెదవులమీద చక్కని చిరునవ్వు చిందులు వేసింది. కాఫీ మూడురోజుల్నుంచీ తాగకపోడంమూలాన కాబోలు ఈ తలనొప్పి! ఎలాగైనా ఆ కాఫీ కాస్త తాగిస్తేనే తగ్గవచ్చు. ఈ ఊహ తన కింతకుముందు తట్టనేలేదు!.. నెమ్మదిగా పొయ్యి అంటించి చక్కని కాఫీ తయారుచేసింది గ్లాసుతో తీసుకొచ్చి మంచందగ్గరగా నిలబడి పిలిచింది. అతను కళ్లు తెరిచాడు - ఎఱ్ఱగా జ్యోతుల్లాగున్నాయి. 'ఇదుగో పక్కింటావిడ ఏదో పొడరిచ్చింది. అది కాఫీలో కలిపి తాగితే తలనొప్పి తగ్గుతుందిట. లేవండీ! యిదుగో తీసుకొచ్చాను' అంది

'కాఫీనా? తీసుకెళ్ళి మోరీలో పొయ్యి' అన్నాడు విశ్వం

'నామాట వినండీ! పోనీ నాకోసమేనా! మీకు కాఫీ అక్కర్లేకపోయినా ఇదివరకంతా నాకోసం తాగలేదూ? - అల్లాగే తాగరూ!...చల్లారిపోతూంది..' అంటూ జాలిగా అతని కళ్ళల్లోకి చూసింది. ఏ కళనున్నాడో విశ్వనాథం లేచాడు. ఆశ అన్నది అందరికీ వుంటుందిగా! ఓమూల తల పగిలిపోతోంది. తాగి చూద్దాం అనుకున్నాడు. పైగా ఇది తన కిష్టమై తాగటం లేదని సావిత్రికూడా తెలుసుకుంది! ఇంక ఫర్వాలేదు. రెండుగుక్కల్లో కాఫీ తాగేసి గ్లాసు సావిత్రి కందించాడు. అమ్మయ్య! అనుకుంది సావిత్రి.

సావిత్రి ఆ విషయం ప్రస్తావించనూలేదు. ఒక్కటిమాత్రం నిజం ఆరోజు సాయంత్రమే విశ్వనాథం ముస్తాబై షికారు కెళ్లిన మాట మాత్రం నిజం. కాఫీతోటే తగ్గిందనుకుని నవ్వుకున్నా పైకి అనడానికి సావిత్రి సాహసించలేదు. నొప్పి తగ్గిందనడానికి విశ్వనాథం సిగ్గుపడైనావుండాలి ఏది ఏమైనా ఎవరూ ఆ విషయమై ప్రస్తావించలేదు. ఆ మర్నాటినుంచీ అతనూ కాఫీ తాగుతున్నాడు! బహుశా తనకోసం తాను తాగుతూన్నట్టు సావిత్రి ఒప్పుకుందని ధీమా అయివుండాలి!

నెలాఖరున ఇరవైతొమ్మిదో తారీఖుకే కాఫీపొడి అయిపోయింది. 'కాస్త ఆఫీసునుంచి వచ్చేప్పుడు రేపు కాఫీ పొడరు కూడా తీసుకురండి' అంది సావిత్రి అంతక్రితంరోజు రాత్రి. 'అప్పుడే అయిపోయిందా పౌను పొడరూ?' రెట్టించి అడిగాడు విశ్వనాథం.

'అప్పుడే అయిపోయిందా అంటే నేనేవన్నా తినేస్తున్నాననా మీ ఉద్దేశ్యం?' పౌరుషంగా తిరిగి అడిగింది సావిత్రి

'మరింత త్వరగా ఎల్లా అయిపోయింది? ఆకలెక్కువై నువ్వే మింగేసివుండాలి' అన్నాడు. 'పైగా నెలాఖరుని పైసలెలా గుంటాయి? రెండోతారీఖు వరకూ నోటికి తాళం వేసుగో!. '

సావిత్రి కీమాట లలవాటే. అంచేతే నవ్వింది

'మీకే తలనొప్పి వస్తుంది? నాకేం?... అప్పుడు తలనొప్పి పాపం ఎలా తగ్గిందో గుర్తుకు తెచ్చుకోండి!'.. అంది కొంచెం పెంకెతనంగా

'ఓహ్! ఇంతోటి వెధవ కాఫీకే తగ్గిందంటావ్! సిగ్గులేకపోతేసరి వేసుకున్న ఆస్ప్రోబిళ్ళ లప్పటికి పనిచేసి తగ్గివుండాలి కాని నీ కాఫీకి కాదు! మాటలు నేర్చిన ఆడదానవు. నదురూ బెదురూ లేదు!'. .సావిత్రి నోరుమాట్లాడలేదు.

తెల్లారేక మళ్ళీ కాఫీ కాచింది. విశ్వనాథాని కిచ్చింది. 'అక్కర్లే' దన్నాడు రాత్రి కోపం చల్లారలేదని సావిత్రికి తెలుసు. అల్లా ఒకసారి దగ్గరకి తీసిగెళ్ళి గ్లాసు చూపెట్టకుండా తనే తాగేస్తే మరీ తెగించిందనుకుంటాడని అదీ భయమే!... జాగ్రత్తగా మూత పెట్టివుంచింది ఆఫీసుకు వెళ్తూ అతను డబ్బులు జేబులో వేసుకు వెళ్లడం సావిత్రి చూసింది అవి ఎలాగూ కాఫీ పొడరుకేనని తనకు ఖచ్చితంగా తెలుసు! సాయంత్రానికి కాఫీ పొడరు ఇంటికి రావడం తథ్యం! మర్నాడు విశ్వనాథం తాగడంకూడా తథ్యం! అతను ఆఫీసుకి అటు నడవగానే ఇటు గ్లాసుడు కాఫీ సావిత్రి గొంతులోకి వెళ్ళిపోయింది. అతని తరహా అది! ఈవిడ తరహా యిది! ఇద్దరూ ఘటికులే...అంచేత వారి సంసార శకట